# భారతమాత మహా హారతి కార్యక్రమానికి భూమి పూజ



ఖైరతాబాద్: భారత మాత మహా హారతి కార్యక్రమాన్ని పీపుల్స్ ప్లాజా వేదికగా ఈ నెల 22వ తేది ఆదివారం నిర్వహిస్తున్నట్లు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం పీపుల్స్ ప్లాజాలో ఆయన భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. భారతమాత ఫౌండేషన్ ఆధ్వర్యంలో 6వసారి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం నిర్వహించే మహా హారతి కార్యక్రమానికి అనేక రాష్ట్రాల నుంచి సాంస్కృతిక కళాకారుల హాజరవుతారని, 3 వేల మంది యువతులు భారతమాత వేషధారణతో పాల్గొంటారని తెలిపారు. భారత మాత విగ్రహాన్ని శనివారం పీపుల్స్ ప్లాజాకు తరలించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతంరావు, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భారత మాత మహా హారతి 22న



భూమి పూజ చేస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, భాజపా నేతలు

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: గణతంత్ర ఉత్సవాల సందర్భంగా ఏటా మాదిరిగా భారత మాత ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'భారత మాత మహా హారతి' ఈనెల 22న సాయంత్రం నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్ ప్లాజాలో నిర్వహించనున్నట్లు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం భాజపా నేతలతో కలిసి భూమి పూజ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. మూడు వేలకు పైగా అమ్మాయిలు భారత మాత వేషధారణలో జాతీయ పతాకాన్ని చేతపట్టుకుని ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్నారని తెలిపారు. మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ఆర్ట్ ఆఫ్ లివింగ్ రవిశంకర్ తదితర ప్రముఖులు హాజరుకానున్నట్లు వివరించారు. మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. 21న సాయంత్రం భారత మాత విగ్రహాన్ని ర్యాలీగా తెచ్చి పీపుల్స్ ప్లాజాలో ప్రతిష్ఠించనున్నట్లు వివరించారు.